

# ఏటి ఒడ్డున నీటిపూలు

## - కోలిపాక రమామణి



రమామణిగారు 29 యేళ్ళ వయసులో వ్రాసిన మొదటి నవల ఈ 'ఏటి ఒడ్డున నీటిపూలు'. పోటీల్లో బహుమతి గెలుచుకుంది. తర్వాత కన్నడపత్రికలో అనువాదమై సీరియల్ గా వచ్చింది. అప్పుడు పుస్తకరూపంలో వెలువడింది. ఆ తర్వాత నాలుగైదు సంవత్సరాల వ్యవధిలోనే 'వెన్నెల్లో పిల్లనగ్రోవి', 'గడ్డిపోచలు','హాలాహలంలో అమృతం' లాంటి పాఠకాదరణ పొందిన నవలలు వ్రాశారు. అప్పటి అన్ని ప్రముఖపత్రికలలోను, ఆకాశవాణికి కథలు కూడా వ్రాశారు.

(గత సంచిక తరువాయి)

ఆంధ్రప్రభ వారపత్రిక ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల (1968)

### 14

**శ్రీదేవి పెళ్లి** ముహూర్తం సాయంత్రం ఏడు గంటల రెండు నిమిషాలకి. సాయత్రం అయిదు గంటలకే పెళ్లి తంతు ప్రారంభించారు. లోపల శ్రీదేవి బుట్టలో కూర్చుని గౌరీ పూజ చేస్తుంటే, పైన పందిరిలో పెళ్లి కొడుకు చేత ఏవో పూజలు చేయిస్తున్నాడు పురోహితుడు. పెళ్ళికొడుకు పొడుగ్గా ఉన్నాడు. చక్కటి విగ్రహం, ప్రవర్తనలో హుందాతనం పెళ్లికొడుకుకి అందాన్ని ఇస్తున్నాయి. అంత హుందాతనంలో కూడా అతనిలో ఉత్సాహం ఉరకలు వేస్తున్నట్టు తెలిసిపోతూ ఉంది.

"ఇంకా ఎంతసేపే పూజ, మీ ఆయన నీ కోసం అక్కడ క్షణం ఒక యుగంగా ఎదురు చూస్తూ ఉంటేనూ?" అని శ్రీదేవికి అన్న వరసైన ఒకతను వచ్చి శ్రీదేవినీ, చుట్టుపక్కల వాళ్ళనీ నవ్వించి వెళ్ళిపోయాడు.

పద్మకి శ్రీదేవి పెళ్లి చూస్తూ ఉంటే తన పెళ్లి గుర్తుకి వచ్చింది. శ్రీదేవిలాగే తనూ భక్తితో గౌరిని పూజించింది. మాధవరావుని పీటల మీద చూడాలని తహతహ లాడింది.

పురోహితుడు లోపలి వచ్చి, "అమ్మాయిని తీసుకు రండమ్మా. ముహూర్తం సమీపిస్తూంది" అన్నాడు.

"మేనమామలను పిలుచుకు రండి. బుట్ట ఎత్తాలి" అంది శ్రీదేవి తల్లి.

"అమ్మా! ఇంత పెద్దదాన్ని ఎత్తడమేమిటి? వద్దమ్మా" అంది శ్రీదేవి మెల్లిగా.

ఇంతలోనే ఆజానుబాహులైన నలుగురు మేనమామలు వచ్చి శ్రీదేవిని బుట్టపాళంగా ఎత్తేసి, తీసుకు వెళ్లి పెళ్లి కొడుక్కి ఎదురుగా కూర్చోపెట్టారు.

శ్రీదేవి తెగ సిగ్గు పడింది. శ్రీదేవికి మధ్య తెర అడ్డం పెట్టారు. పెళ్లికూతురితో పాటు బయటికి వచ్చిన చారుమతి, పద్మ కొంచెం దూరంలో ఎదురుగా కూర్చున్నారు. అక్కడి నించి చూస్తే పెళ్లికొడుకు, శ్రీదేవి ఇద్దరూ సమంగా కనిపిస్తారు.

పురోహితుడు మంత్రాలూ చదువుతూ అందరికీ అక్షింతలు ఇస్తూ, పద్మకీ, చారుమతికీ కూడా ఇచ్చాడు. భజంత్రీలు పెద్దపెట్టున మోగాయి. పెళ్ళికొడుకు పెళ్ళికూతురి తలమీద జీలకఱ్ఱ బెల్లం పెట్టాడు. శ్రేదేవి చెయ్యి పట్టుకుని పెళ్ళికొడుకు తలమీద జీలకఱ్ఱ పెట్టించింది

తల్లి. వాళ్లలా ఉండగానే మధ్య తెర తీసేశారు. హిందూ వివాహ పద్ధతిని వధూవరులకు అదే ప్రథమ వీక్షణం, శుభ వీక్షణం కావాలి. వధూవరుల చూపులు కలుసుకున్నాయి. శ్రీదేవి వెంటనే సిగ్గు పడుతూ కళ్ళు దించేసుకుంది. వరుడు మాత్రం అమ్మాయి కళ్ళల్లోకి చిలిపిగా చూస్తున్నాడు.

'ఇంతమంది మధ్యన కూర్చుని శ్రీదేవి వైపు అలా చూస్తాడు, సిగ్గు లేదా?' అనుకుంది చారుమతి మనసులో. పైకి మాత్రం, "శ్రీదేవిని తినేసేటట్టు చూస్తున్నాడు కదూ?' అంది పద్మతో.

పద్మ ఈ లోకంలో లేదు. పద్మ మనసు మాధవరావు చుట్టూ పరిభ్రమిస్తూంది. తెర తియ్యగానే తన పెళ్ళిలో సిగ్గువల్ల కళ్ళు దించేసుకుంది తను. 'మాధవరావు ఇలాగే చిలిపిగా చూశాడా తనని?' అనుకుంటూంది మనసులో.

శ్రీదేవికి, పెళ్లికొడుకుకి మధుపర్కాలు ఇచ్చి లోపలికి పంపించారు. వాళ్ళు అవి కట్టుకుని రావాలి.

చారుమతి చుట్టూ చూసింది. ఆడవాళ్ళంతా పట్టు చీరలతో, నగలతో ఎలక్ట్రిక్ బల్బుల కాంతిలో మెరిసి పోతున్నారు. రకరకాల నగలూ, చీరలూ చూస్తూ పద్మ వైపు దృష్టి తిప్పించి. పద్మ చెవుల నున్న దుద్దులు తళుక్కున మెరిసాయి.

"కొత్తవా పద్మా, దుద్దులు? ఎప్పుడు చేయించు కున్నావు?"

"ఈ మధ్యే చేయించుకున్నాను. ఇవాళే పెట్టుకున్నాను" అంది పద్మ.

"ఏమిటి? వజ్రాల దుద్దుల్లా అంతగా మెరుస్తున్నాయి? మీ అత్తగారు చేయించారా?"

"అమ్మే చేయించింది. వజ్రాలే!" అంది పద్మ ముభావంగా.

'ఒక్క కూతురు. వజ్రాలు చేయిస్తారు. వైడూర్యాలు పెడతారు అనుకుంది చారుమతి పద్మ గురించి ఆలోచిస్తూ. కాని చారుమతికీ తెలుసు పద్మ ఇంటి స్థితి గతులు. పద్మ తండ్రి కాలేజీలో లెక్చరరు. ఆయనకి జీతం తప్ప వేరే ఆదాయం లేదు.

ఈ మధ్యే పాత ఇల్లు పడగొట్టి కొత్త ఇల్లు కట్టారు. ఆయన దాచుకున్న సొమ్మంతా ఆ ఇంటికీ, కూతురు పెళ్ళికీ ఖర్చు అయిపోయింది. "నా పెళ్లికే అంతా ఖర్చు పెట్టేస్తున్నారు. తరువాత ఏం చేస్తారు అమ్మా, నాన్నా?'నాకో అన్నేనా లేదు వాళ్ళని చూసుకోవడానికి" అంది పద్మ ఒకసారి మాటలలో.

మరి ఇప్పుడు వజ్రాల దుద్దులు ఎందుకు చేయించారో? ఒక్క కూతురే ఉంటే అన్ని ముద్దుముచ్చట్లు జరపాలని ఉంటుందేమో!

చారుమతి ఆలోచనలలో ఉండగానే పెళ్ళికొడుకు వచ్చి పీటల మీద కూర్చున్నాడు. కుడి వైపు నించి శ్రీదేవిని తీసుకు వస్తున్నారు. ఆమె ముందూ, వెనకా పెద్ద ముత్తైదువులు పళ్ళాలలో నేతి దీపాలు వెలిగించి పట్టుకున్నారు. దీపాల మధ్య ఎఱ్ఱ జరీ అంచు తెల్ల చీరతో శ్రీదేవి పార్వతీ దేవిలా మెరిసిపోతూంది. మూర్తీభవించిన పవిత్రతలా, ప్రేమ మూర్తిలా కనిపిస్తూంది.

మంగళసూత్రాలు వధూవరుల మధ్య పెట్టి, పూజ చేయించాడు పురోహితుడు. తరువాత శ్రీదేవి తల్లికి అక్షింతలు ఇస్తూ, "అమ్మా! అందరికీ ఇచ్చి రండి" అని చెప్పాడు. శ్రీదేవి తల్లి పెళ్లి అయిన ప్రతి స్త్రీ దగ్గిరికీ వెళ్లి వాళ్ళ మెడకి ఒకసారి మంగళసూత్రాలు తాకించి, అక్షింతలు ఇస్తూంది. పద్మ మెడలో పెట్టి చారుమతి దగ్గిరకి వచ్చింది ఆమె. అలవాటు ప్రకారం మంగళసూత్రాలు పెట్టబోతున్న ఆమెను చూసి, చారుమతి తల వెనక్కి జరిపింది.

"ఆనంద మానంద మాయెనె. సీతమ్మ పెళ్ళికూతురాయెనె" సన్నాయివాళ్ళు గట్టిగా వాయిస్తూ ఉంటే, పెళ్ళికొడుకు మంగళసూత్రాలు తీసుకుని శ్రీదేవి మెడలో మూడుముళ్ళూ వేశాడు. కుమారి శ్రీదేవి శ్రీమతి శ్రీదేవి అయింది.

వధూవరులిద్దరూ తలంబ్రాలు పోసుకుంటూ ఉంటే ముచ్చటగా ఉంది. పెళ్ళికొడుకు చాలా అల్లరి వాడిలా ఉన్నాడు. శ్రీదేవికి అవకాశం ఇవ్వకుండా రెండు పళ్ళాలలోనివి అతనే శ్రీదేవి మీద కుమ్మరిస్తున్నాడు.

శ్రీదేవి అక్కలిద్దరూ పరిగెత్తుకు వచ్చారు. "ఏమే, అలా కూర్చుంటావు? ఆ పళ్ళెం ఎత్తి మఱిదిగారిమీద పోసెయ్యి" అంటూ ప్రోత్సహిస్తున్నారు.

శ్రీదేవి సిగ్గు పడుతూంది. శ్రీదేవి వైపు చిన్నవాళ్ళంతా ... అన్నలూ, అక్కలూ చుట్టూ చేరి శ్రీదేవిని ప్రోత్సహిస్తున్నారు.

మగపెళ్లివారు, శ్రేదేవి అక్కల భర్తలు పెళ్లి కొడుకు వైపు చేరి అతనికి మద్దతు ఇస్తున్నారు.

శ్రీదేవి అక్క ప్రభావతి భర్తని చూసి మందలిస్తూంది. "మీరు మగ పెళ్లివారి వైపు చేరి పోయారేమిటీ? ఆడపెళ్ళివారు! మఱిదిగారిని వదిలిపెట్టి ఇటు రండి."

"మీ కొంగు పట్టుకోవాలంటావు! బాబోయ్! ముగ్గురు అక్కచెల్లెళ్ళూ కలిస్తే మా మగవాళ్ళ పని అయినట్టే. ఎలాగైనా అబ్బాయ్ మా తెగవాడు. మా తమ్ముడు. అతనికే మా మద్దత్తు."

వీళ్ళ గొడవలో ఎవరూ చూసుకోలేదు, శ్రీదేవి పళ్ళెం ఎత్తి పెళ్ళికొడుకు మీద అక్షింతలన్నీ కుమ్మరించడం. పురోహితుడితో సహా అందరూ సంతోషంగా నవ్వారు.

పెళ్లి అయిన ప్రతివాళ్ళు తమ వివాహం జ్ఞాపకం చేసుకుంటున్నారేమో, వారి పెదవుల మీద చిరునవ్వు నాట్యం చేస్తూంది.

"ఎంత ఆనందం! ఎన్ని నవ్వులు! ఎంత సరదాగా ఉన్నారు అంతా! తనకి ఎప్పటికేనా ఇలా పెళ్లి అవుతుందా? తను మధుపర్కాలు కట్టుకుని పెళ్లి కొడుకు మీద తలంబ్రాలు పోస్తుందా?" చారుమతి మనసులోనే ఊహించుకుంది.

చారుమతి ఏదో ఆలోచిస్తూనే ఎదురుగుండా ఉన్న మగవాళ్ళ కుర్చీలలోకి చూసింది. ప్లీడరుగారు ముందు వరసలోనే కూర్చుని ఉన్నారు. చారుమతి కళ్ళు ఆత్రంగా పక్కన వెతికాయి. కాని నిరాశే అయింది. డాక్టరు గిరిధారి కనిపించలేదు.

చారుమతి మనసులో డాక్టరు గిరిధారి మధుపర్కాలతో తన పక్కనే పెళ్లికొడుకై కూర్చున్నట్టు ఒక్క క్షణం ఒక ఊహ మెదిలింది. వెంటనే అనుకుంది, "నేనెక్కడ? అతనెక్కడ?" అని.

కాని మనసు చెడ్డది, విచక్షణ జ్ఞానం ఉండదు. అది ఇష్టం వచ్చినట్టు, కళ్ళెం లేని గుఱ్ఱంలా పరిగెడుతూనే ఉంటుంది.

పెళ్లి తంతు ముగియగానే, భోజనాల ఏర్పాట్లు మొదలు పెట్టారు. పందిరి కింద శుభ్రం చేసి అరిటాకు విస్తళ్ళు వేశారు. ప్రతి విస్తరి చుట్టూ ముగ్గులు పెట్టారు. వధూవరుల ఆకుల చుట్టూ రంగు ముగ్గులు తీర్చి, ప్రమిదలు అమర్చి, దీపాలు వెలిగించారు. పచ్చటి ఆకుల మధ్య తెల్లటి కొత్త వెండి కంచాలు పెట్టారు. కంచాలలో విందు భోజనం అమర్చి శ్రీదేవినీ, పెళ్లికొడుకునీ తీసుకువచ్చి కూర్చోబెట్టారు. శ్రీదేవితో కాలేజీలో చదివిన అమ్మాయిలు కూడా చాలామంది వచ్చారు. స్నేహితురాళ్ళంతా వధూవరుల పక్కనే పంక్తులలో కూర్చున్నారు,

పద్మా, చారుమతీ పంక్తిలో చివర, మూలగా కూర్చున్నారు. తక్కిన ఆడపిల్లలంతా శ్రీదేవి మీద ఛలోక్తులు విసురుతూ సరదాగా ఉన్నా, అందరితో కలవలేక పోయారు ఇద్దరూ. సిల్కు బట్టలు కట్టుకుని చక్కగా ముస్తాబైన వాళ్ళ పంక్తిలో కూర్చోడానికి సిగ్గుగా ఉంది చారుమతికి. 'తను కట్టుకున్నది ఎప్పుడో పదహారు రూపాయలు పెట్టి కొనుక్కున్న పువ్వుల జార్జెట్ చీర. ఎలా ఉన్న వాళ్ళయినా చక్కటి బట్టలు కట్టుకుంటే అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తారు. అందమైన చీరలు కట్టుకున్న అందమైన కాలేజీ అమ్మాయిల మధ్య తను గులాబీపూల మధ్య గడ్డి పువ్వులా ఉన్నాను' అనుకుంది  చారుమతి.

తన కాపరంలో కనిపించే వెలితీ, తనకీ భర్తకీ మధ్య ఉండే దూరం మననం చేసుకుంటున్న పద్మ ముభావంగా ఉండిపోయింది.

విందు చాలా ఘనంగా ఉంది. మూడురకాల తీపి వంటలూ, మూడు రకాల కారపు పిండి వంటలూ, నాలుగు కూరలు, పప్పూ, పెరుగుపచ్చడీ, ఊరగాయలు, అప్పడాలు, ఒడియాలు.. అరిటాకు నిండా వడ్డించారు. కాని ఒక్కటీ రుచించలేదు చారుమతికి. ఇంట్లో

శాంతమ్మ, భానుమతి ఏ ఆదరవు లేకుండా వట్టి అన్నం పచ్చి మిరపకాయతో తింటారనే జ్ఞాపకం గొంతులో అడ్డుపడి, విందు భోజనం మింగుడు పడలేదు.

భోజనాలయ్యాక శ్రీదేవి దగ్గరికి వెళ్ళారు స్నేహితురాళ్లిద్దరూ.

"ఎక్కడున్నారు ఇంతసేపు పద్మా? నాకు కనిపించనే లేదు" అంది శ్రీదేవి.

"నీ పక్కనే ఉన్నాం. అయినా మేం ఎందుకు కనిపిస్తామింక? లోకమంతా ఒకరే కనిపిస్తారు నీకు!" అంది చారుమతి.

"పో చారూ!" అంటూ శ్రీదేవి చారుమతి వీపుమీద చిన్న దెబ్బ వేసింది. శ్రీదేవి అలిసినట్టు కనిపించినా, కొత్త అందంతో ఎంతో నిండుగా ఉంది. తెల్ల జరీ మధుపర్కం చీర అక్షింతలు పడి పసుపు రంగు పులిమినట్లయింది. మెళ్ళో వేసిన కర్పూర దండలూ, మల్లె దండలూ చిక్కు పడి పోయాయి. వాటి మధ్య కొత్త మంగళ సూత్రాలు తొంగి చూస్తున్నాయి. జడనిండా కుట్టిన మల్లెమొగ్గలు విచ్చుకుని సౌరభాలు వెదజల్లుతున్నాయి. పెళ్ళికూతురికి రూపకల్పనలా ఉంది శ్రీదేవి.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?' శ్రీదేవి అడిగింది.

"నీ ప్రోగ్రాం ఏమిటి చెప్పు? అత్తవారింటికి ఎప్పుడు వెళ్ళటం?" అంది చారుమతి.

"ఏమో, నాకేం తెలుసు?" శ్రీదేవి మొహమాట పడింది.

"ఏమండీ, ఈ అమ్మాయి ఏమీ తెలియదని తప్పించుకుంటూంది. మీరైనా చెబుతారా?" అంది చారుమతి, శ్రీదేవి అక్క ప్రభావతిని చూస్తూ.

"ఏముందమ్మా! పెళ్లి తంతు ఇంకా మిగిలి పోయింది. హోమం, సప్తపదీ, అప్పగింతలు ఉండి పోయాయి. పొద్దున్న అవి అయిపోతాయి. రాత్రి శోభనం తంతు జరిపేస్తారు. అమ్మాయి ఒకటే తొందర పడుతూందా!" అటూ ఆగి చెల్లెలి వైపు చూసింది ప్రభావతి.

"ఏమిటి అక్కా? నువ్వు కూడా?" అంటూ బుంగ మూతి పెట్టి కోపం నటించింది శ్రీదేవి.

"పోనీ, మీ ఆయన తొందర పడిపోతున్నారు. సరేనా! ఎల్లుండి పొద్దున్నే గృహప్రవేశానికి వరంగల్ తీసుకు వెళతారు. బస్సు మాట్లాడారు."

"ఎల్లుండి ఎన్నింటికి తీసుకు వెళతారు?"

"ఉదయం కాఫీ, టిఫిన్ తీసుకు వెళతారు. ఎలా లేదన్నా తొమ్మిది అవుతుంది."

"ఎల్లుండి పొద్దున్న వస్తాం, దేవీ" అంది పద్మ. చారుమతి కూడా అదే అంది.

ప్రభావతి రెండు కాయితం పొట్లాలు తెచ్చి ఇచ్చింది ఇద్దరికీ.

"ఇదేమిటీ?" అంది చారుమతి తీసుకోకుండా.

"ముందర తీసుకో. ఇందులో కొంచెం లడ్లు పెట్టాను. ఇంట్లో అక్కా వాళ్లకి ఇవ్వు."

"ఇంత రాత్రి ఎలా వెళతారు? ఎవరినేనా పంపనా?" అంది శ్రీదేవి.

"ఎవరూ అక్కరలేదు. శంకరం వచ్చాడు. ఇద్దరం వెళ్లిపోతాము" అంది చారుమతి.

"శంకరం భోజనం చేశాడా?"

"ఆ.. చేశాడనుకుంటాను" అంది చారుమతి బయటికి వస్తూ.

"చేశాడనుకోవడం ఏమిటీ? అక్కా! నువ్వు చారుతో వెళ్లి వాళ్ళన్న భోజనం చేశాడో లేదో కనుక్కో" అంది శ్రీదేవి, ప్రభావతిని కూడా పంపుతూ.

ప్రభావతి, చారుమతి, పద్మ బయటికి వచ్చేసరికి శంకరం వీళ్ళ కోసమే ఎదురు చూస్తూ గేటు దగ్గర తచ్చాడుతున్నాడు.

"ఏమయ్యా? భోజనం చేశావా? ఇక్కడ నుంచున్నావేమిటీ, ఇంట్లో కూర్చోక?" అంది ప్రభావతి.

"భోజనం చేశానండీ" అన్నాడు ముభావంగా శంకరం.

తరువాత ప్రభావతి దగ్గిర సెలవు తీసుకుని పద్మ, చారుమతి బయట పడ్డారు.

పౌర్ణమి ముందు రోజులు. రోడ్ల మీదంతా వెన్నెల పడుతూంది. పైగా, వేసవికాలం రాత్రులు. అప్పుడే కొద్దిగా చల్లగాలి ప్రారంభమై నడవటానికి బాగుంది.

"నడిచి పోదామా పద్మా? మేం ఇద్దరం మీ ఇంటి దాకా నిన్ను దిగబెట్టి, మా ఇంటికి వెళతాం" అంది చారుమతి.

"మీ ఇల్లో పక్కా, మా ఇల్లో పక్కా. మీకు చుట్టూ తిరిగినట్టు అవుతుంది. నేను రిక్షా మీద వెళిపోతాను" అంది పద్మ.

"మీరు ఒంటరిగా ఇంత రాత్రి ఎలా వెళతారు? మేం దిగబెట్టి వెళిపోతాం" అన్నాడు శంకరం పద్మను చూస్తూ.

పద్మ, "సరే" అని ఊరుకుంది. ముగ్గురూ మౌనంగా నడుస్తున్నారు.

రోడ్డు మీద వీళ్ళ నీడలు పడుతున్నాయి. సగం వెన్నెల, సగం నీడ. 'జీవితం ఇంతే! వెలుగు నీడలా సమ్మేళనం, సుఖ దుఃఖాల కలియిక అంటారు' అనుకుంది చారుమతి. 'ఇప్పటి దాకా చీకటీ, కష్టాలే చూసాను. వెలుగు, సుఖం అన్నవి వస్తాయా జీవితంలో? కనుచూపు మేరలో ఆ ఆశ కనిపించడం లేదు' అనుకుంది తిరిగి.

"పరీక్షలు బాగా రాశారా?" శంకరం పద్మని అడిగాడు.

"బాగానే రాసాను. అయినా రిజల్ట్స్ వచ్చేవరకూ నమ్మకం లేదు" అంది పద్మ.

"మీకేమండీ, ఆడపిల్లలకి చదువుకోడానికి బోల్డు టైము. ఇట్టే పాసయిపోతారు."

"అబ్బాయిలకి ఎందుకు లేదు టైము?" పద్మఆశ్చర్యంగా అడిగింది.

"అబ్బాయిలకి లెక్కలేనన్ని వ్యావృత్తులు. సాయంత్రం మేం అలా ఒకసారి తిరిగి వస్తాం. అమ్మాయిలు ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే కూర్చుని భట్టీయం వేస్తారు." నవ్వుతూ అన్నాడు శంకరం.

శంకరం మాటలలో అర్థం కనిపించలేదు చారుమతికి. కావాలని పద్మతో కలిపించుకు మాట్లాడుతున్నట్టు ఉంది.

శంకరం ప్రవర్తన వింతా ఉంది. మాటిమాటికీ పద్మని చూస్తున్నాడు. ఉత్సాహంగా ఉన్నాడు.

పద్మ మాత్రం తనకి ఏమీ పట్టనట్టూ, ఎవరితో ఏ సంబంధం లేనట్టూ పరాకుగా నడుస్తూంది.

వెన్నెల పద్మ అందానికి మెరుగులు దిద్దుతూంది. ఎఱ్ఱ పట్టుచీర, రవ్వల దుద్దులు, మెడలో నల్ల పూసలు పద్మని అపురూప సౌందర్యవతిని చేశాయి. తమలపాకులతో ఎఱ్ఱబారిన పెదవులు గులాబీ రేకులలా ఉన్నాయి. పద్మ నవ్వితే ఎంతో అందంగా ఉంటుంది. విశాలమైన కళ్ళు కిందికి వాల్చి, సిగ్గు పడుతున్నట్టు నవ్వుతుంది.

'నేనే పద్మ అందానికి ఇంత ఆకర్షితురాలి నవుతున్నాను. ఇంకా శంకరం మెచ్చుకునే కళ్ళతో పద్మని చూడటంలో ఆశ్చర్యమేముంది?' అనుకుంది చారుమతి.

పద్మ ఇల్లు వచ్చే వరకూ ముగ్గురూ మౌనంగానే ఉండి పోయారు.

## 15

గృహప్రవేశానికి వరంగల్ తీసుకెళ్ళడానికి బస్సు సిద్దంగా ఉంది. పెళ్లి వారంతా తయారయ్యారు. శ్రీదేవి మాత్రం స్నేహితురాళ్ళ కోసం ఆత్రతతో ఎదురు చూస్తుంది. నిన్న సాయంత్రం దాకా పెళ్లి కొడుకు ముందు ఉన్న సిగ్గు రాత్రి పరిచయంతో వదిలి పోయింది. రాత్రి

అతను చెప్పాడు. వరంగల్ లో మూడురోజులు గడిపి హనీమూన్ కు మైసూరు, బెంగళూరు వెళతారు. అక్కడ పదిహేను రోజులుండి వెనక్కి వెళ్ళి హైదరాబాద్ చేరుకుంటారు.

"తరువాత?" అంది శ్రీదేవి సిగ్గుపడుతూ.

"తరువాత ఏముంది? అమ్మాయిగారు అబ్బాయిగారితో కాపరం చేస్తారు హైదరాబాదులో" అంటూ శ్రీదేవిని ముందుకు లాక్కున్నాడు.

ఇక కాకినాడ రాదు. అటునించి అటే కాపరానికి వెళ్ళిపోతుంది శ్రీదేవి ఈ తలపు అంత బాధాకరంగా లేదు. భర్తతో పరిచయం ఒక్క రోజుదే అయినా అతన్ని విడిచి ఒక్క క్షణం ఉండలేననిపిస్తూంది శ్రీదేవికి. కాని వెళ్ళే ముందు చారుమతితో, పద్మతో చెప్పి వెళ్ళాలి. లేకపోతే బాధ పడతారు.

"దేవీ! మీ ఫ్రెండ్సు వచ్చారు" అంటూ లక్ష్మీదేవి చారుమతినీ, పద్మనీ తీసుకు వచ్చింది.

శ్రీదేవి దగ్గిరగా వచ్చి ఇద్దరి చేతులూ పట్టుకుంది.

"నేనింక కాకినాడకి ఇప్పట్లో రానేమో చారూ" అంది మెల్లిగా.

"అదేం? వరంగల్ నించి రావా?' అంది చారుమతి.

తమ ప్రయాణ వివరాలు చెప్పింది శ్రీదేవి.

ముగ్గురూ మౌనంగా ఉండిపోయారు. శ్రీదేవి అంత హఠాత్తుగా తమని విడిచిపోవడం కష్టం కలిగించింది చారుమతికి, పద్మకి. పద్మ తన చేతిలో ఉన్న పాకెట్ తీసి శ్రేదేవి చేతిలో పెట్టింది. అందులో వెండివి రెండు చక్కటి దీపపు కుందెలు ఉన్నాయి.

"ఎందుకివన్నీ పద్మా? ఇంత ఖరీదువి ఎందుకు తెచ్చావు?"

"ఏదో నాకు నచ్చింది ఇచ్చాను. నీకు నచ్చితే సంతోషం."

"నాకెంతో నచ్చాయి పద్మా. బహుమతి వెనక ఉండే భావం మరీ బాగుంది. నేను ఇక రోజూ వీటితోనే దేవుడికి దీపాలు వెలిగిస్తాను."

"ఇది నా కానుక దేవీ" అంటూ ఒక చిన్న బౌండు నోటు పుస్తకం ఇచ్చింది చారుమతి.

అది చూడగానే చలించిపోయింది శ్రీదేవి. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ పుస్తకంలో తనకు నచ్చిన గేయాలన్నీ చక్కటి అక్షరాలతో రాసుకుంది చారుమతి. ముగ్గురూ మామిడి చెట్టు కింద కూర్చుని ఆ పుస్తకం లో గేయాలు చదువుకుని ఆనందించే వారు. అందులోని గేయాలే తీయని గొంతుతో పాడేది చారుమతి.

"నాకిది ప్రియాతి ప్రియమైనది. అదే నీకు ఇస్తున్నాను. ఇంతకంటె ఏమి ఇవ్వగలను?"

శ్రీదేవి ప్రేమగా చారుమతి చేతిని తన చేతిలోకి తీసుకుంది. ఇంకో చేత్తో పుస్తకం తెరుస్తూ ఇంతకంటే ఏ బహుమతీ నాకు విలువైనది కాదు చారూ" అంది గద్గద కంఠంతో.

ముగ్గురి స్నేహానికి, మధురమైన సాయంత్రాలకి చిహ్నంగా నిలిచి పోయిన ఆ గేయాల సంపుటిని చూస్తూ కూర్చున్నారు ముగ్గురూ.

"దేవీ! వస్తావా?" అంటూ వినిపించిన మగ గొంతుక విని ముగ్గురూ తల ఎత్తారు.

శ్రీదేవి భర్త గుమ్మం దగ్గిర చిరునవ్వుతో నుంచుని ఉన్నాడు.

శ్రీదేవి సంభ్రమంగా లేచి నుంచుంది. స్నేహితుల ముందు భర్త "దేవీ" అంటూ చనువుగా పిలవడంతో సిగ్గూ, ఆశ్చర్యం, తత్తరపాటూ కలిగాయి. భర్త రాక వల్ల కలిగిన ఆనందం ఆమెలో ప్రస్ఫుటంగా కనిపిస్తూంది. సిగ్గుతో ముఖం ఎఱ్ఱగా అయిపోయింది.

చారుమతీ, పద్మా కూడా కలవరపాటుతో లేచారు.

తన రాకవల్ల వాళ్ళలో కలిగిన తత్తరపాటు చూసి మొహమాట పడ్డాడు అతను. అది కప్పి పుచ్చుకుంటూ, "మీ ఫ్రెండ్సా?" అన్నాడు శ్రీదేవిని చూస్తూ.

"అవును. వీళ్లిద్దరూ నాకు మంచి ఫ్రెండ్సు. ఈమె పద్మ. ఈమె చారుమతి." ఇద్దరినీ పరిచయం చేసింది శ్రీదేవి. అతను నమస్కారం చేశాడు,

"మరి నన్ను వాళ్లకు పరిచయం చెయ్యవా? ఈయన పేరు హనుమంతరావండీ. పెళ్లి పత్రికలో చూసే ఉంటారనుకోండి." నవ్వుతూ అన్నాడు, తని తనే చూపించుకుంటూ శ్రీదేవి భర్త.

ముగ్గురమ్మాయిలు నవ్వారు.

"క్షమించండి. మా ప్రయాణానికి వేళ అయిపోతూంది. శ్రీదేవిని మీ దగ్గిరనించి తీసుకెళ్ళి పోవాలి" అన్నాడు అతనే తిరిగి.

"వెళ్ళు శ్రీదేవి" అంది చారుమతి ఆమెను ముందుకు తోస్తూ.

బయట బస్సు సిద్దంగా ఉంది. మగపెళ్లి వారంతా బస్సులో ఎక్కి కూర్చున్నారు. ఆడపెళ్ళివారంతా  వారిని సాగనంపడానికి వీదిలోనే బస్సు పక్కనే నుంచుని ఉన్నారు.

శ్రీదేవి, హనుమంతరావు అందరికీ నమస్కారాలు చేసారు. శ్రీదేవి కళ్ళనీళ్ళు చెంపల మీదినించి జారుతున్నాయి. తొందరగా నీళ్ళు తుడుచుకుంటూ, "వెళతాను పద్మా, వెళతాను చారూ! మరిచి పోకండి" అంది దగ్గిరికి వచ్చి.

"ఉత్తరాలు రాస్తూండు దేవీ" అంది పద్మ గద్గద స్వరంతో.

చారుమతిని ఏదో దిగులు ఆవరించింది. కాని దేవి ఏడుస్తూ వెళ్ళ కూడదు.

"దేవీ! అన్నీ బాగున్నాయి గాని, మీ ఆయన పేరే బాగులేదు" అంది చారుమతి రహస్యంగా. పద్మ నవ్వింది.

"ఆ పేరు నేను పెట్ట లేదుగా?" అంది శ్రీదేవి నీళ్ళు నిండిన కళ్ళతో నవ్వుతూ.

ముగ్గురూ ఏడుస్తూ కూడా ఎందుకు నవ్వుతున్నారో అర్థం కాక ఆశ్చర్యంగా నిలబడి పోయాడు హనుమంతరావు.

శ్రీదేవితో కూడా పెద్దక్క ప్రభావతి గృహప్రవేశానికి వెళ్ళింది.

"మరిచిపోకుండా ఉత్తరాలు రాయి" అంటున్న చారుమతి, పద్మల గొంతులు బస్సు ఇంజను చప్పుడులో కలిసిపోయాయి. శ్రీదేవి భర్త పక్కనే కూర్చుని చేయి ఊపింది.

బస్సు కనిపించేంతవరకూ ఆడపెళ్ళివారు వీధిలోనే నుంచుని తరువాత లోపలి బయలుదేరారు.

"మేం వెళతామండీ" అన్నారు పద్మా, చారుమతి లక్ష్మీదేవితో.

"అప్పుడేనా, కొంచెం కూర్చో కూడదూ? అన్నట్టు శ్రేదేవి భర్త మీతో ఎలా మాట్లాడాడు? సిగ్గు పడ్డాడా?"

"సిగ్గెం పడలేదే? ఎందుకలా అడుగుతున్నారు?" చారుమతి కుతూహలంగా అడిగింది.

"అతన్ని బలవంతం మీద మీరు ముగ్గురు కూర్చున్న గదిలోకి పంపించాం. కొత్త పెళ్లి కొడుకు కదా, అందరి ముందు శ్రీదేవితో మాట్లాడడానికి ఇంకా సిగ్గు పడుతున్నాడు."

చారుమతీ, పద్మా నవ్వుకుంటూ ఆమె దగ్గిర సెలవు తీసుకుని ఇళ్ళకు బయలు దేరారు. ఇద్దరూ విడిపోయే దాకా శ్రీదేవి గురించే మాట్లాడుకున్నారు. సరదాగా ఉండే భర్త దొరకడం శ్రీదేవి అదృష్టం అనుకున్నారు.

'ఇవాళ జూన్ రెండో తారీఖు. ఈ రోజుతో తమ ముగ్గురి జీవితాలలోనూ కొత్త అధ్యాయాలు మొదలవుతాయి. శ్రీదేవి కాపరానికి వెళ్ళింది. ఇన్నాళ్ళుగా కలిసి ఉన్న ముగ్గురు దూరమవుతున్నారు. పద్మ కూడా కొద్ది రోజులలో మద్రాసు వెళ్లిపోవచ్చును. ఎక్కడకీ వెళ్ళనిదీ, జీవితంలో ఏ మార్పూ లేనిది నా జీవితమే' అనుకుంది చారుమతి.

ఇంటికి వెళ్ళగానే భానుమతి చెప్పింది.

"గది అద్దెకు కావాలని ఎవరో ఒకాయన వచ్చారు. గది చూసుకుని నచ్చిందనీ, సాయంత్రం వచ్చి దిగుతామని చెప్పారు."

చారుమతి చాలా సంతోషించింది. "అద్దె ఎంతని చెప్పారు?"

"పద్దెనిమిది రూపాయలు."

శాంతమ్మ కూడా ముందరి గదిలోకి వచ్చింది. అప్పుడే అత్తగారికి భోజనం పెట్టింది. ఆవిడికి కంచంలో అన్నం పెట్టి, మెత్తగా కలిపితే కొద్దిగా ఓపిక తెచ్చుకుని, మంచం మీద దిండ్లను ఆనుకుని కూర్చుని గంట సేపు నమిలి మెల్లిగా తింటుంది. ఆవిడ తిన్నంత సేపు పక్కనే ఒక మనిషి ఉండాలి. పైగా భోజనం చేస్తున్నంత సేపూ ఆవిడ ఆయాస పడుతూ ఏదో మాట్లాడుతూనే ఉంటుంది. వాళ్ళ చిన్నప్పుడు రూపాయికి పదహారు శేర్లు మంచి బియ్యం ఇచ్చేవారని, కానీకి ఒక ముంత రాయిలాంటి గట్టి పెరుగు దొరికేదని, కమ్మటి నెయ్యి రూపాయికి అయిదు పావులని, మూడు రూపాయలకి మంచి ఎనిమిది గజాల చీరని ఏవో పాత కబుర్లు చెపుతుంది. పక్కన కూర్చున్నవాళ్ళు ఊ కొట్టాలి. లేకపోతే కోపం. రోజూ శాంతమ్మే కూర్చుంటుంది.

"శ్రీదేవి వెళ్లి పోయిందా?' అంది శాంతమ్మ కూతుళ్ళ దగ్గిరికి వస్తూనే.

"ఆ. వెళ్ళింది" అంది చారుమతి.

ఏ అమ్మాయి పెళ్ళయి, అత్తవారింటికి వెళ్ళిందన్నా శాంతమకు కొంచెం ఈర్ష్యగా ఉంటుంది. తన కూతుళ్ళకి పెళ్లి కాలేదని దిగులు.

"మీ పద్మ ఎప్పుడు వెళుతుంది కాపరానికి?"

"నాకు తెలీదు."

"వెళుతుందిలే, పెళ్ళయ్యాక కాపరానికి వెళ్ళదా? అంతా అదృష్ట వంతులు. మనకే అన్ని దురదృష్టాలూను. మనింట్లో ఒక్కటీ కలిసి రాదు" అంది శాంతమ్మ నిస్పృహగా.

"ఎందుకలా అనుకోవాలమ్మా. అదృష్టం, దురదృష్టం అందరి జీవితాలలోనూ కలిసి ఉంటాయి. మనమే దురదృష్టమంతులమని ఎందుకనుకోవాలి?" అంది భానుమతి.

భానుమతి అచ్చు తండ్రి పోలిక. అదృష్ట దురదృష్టాలని రెండూ ఒక రకంగానే చూస్తుంది.

కొంతమంది పెద్ద కోరికలు పెట్టుకుంటారు. ఆ కోరికలు తీరక పోయినా, ఏ మాత్రం అటూ ఇటూ అయినా తాము దురదృష్టమంతులమనీ, తమ చుట్టూ ఉన్నవాళ్ళు అదృష్టవంతులనీ నిందించు కుంటారు. తమ పరిస్థితులను బట్టి, వాతావరణాన్ని బట్టి మనిషి కోరికలు పెంచుకోవాలి. ఆకాశ హర్మ్యాలు నిర్మించుకోవడం అవివేకం. చివరికి దుఃఖమే ముగులుతుంది.

అందంగా, తెల్లగా, ముద్దబంతి పూవులా ఉండే శాంతమ్మ ధనవంతుడైన, అందగాడైన భర్త వస్తాడని కలలు కంది. కర్మవశాత్తూ ప్లీడరు గుమాస్తా సూర్యారావుకి భార్య అయింది. మొదటి సారి కాన్పు రాగానే తనకు చక్కటి కొడుకు పుట్టాలని కోరుకుంది. కాని మొదటిసారి కాదు, నాలుగుసార్ల దాకా ఆడపిల్లలే పుట్టి, ఐదో కాన్పులో శంకరం కలిగాడు. శంకరం ముందు పుట్టిన నలుగురు ఆడపిల్లలలోనూ ఇద్దరు చిన్న తనంలోనే పోయారు. శంకరం తరువాత నలుగురు ఆడపిల్లలు పుట్టారు. అందులో ఒక పిల్ల రెండేళ్ళు పెరిగి పోయింది. ఆమెకు తొమ్మిది కాన్పులైనా మిగిలిన వాళ్ళు ఆరుగురు. ఒక్కడే కొడుకు. ఇంకా కొడుకులు పుట్టాలనే కోరిక అలాగే మిగిలి పోయింది.

శాంతమ్మకు జీవితంలో ఇలాటి ఎదురుదెబ్బలు తగిలినా కోరికలు పెంచుకోవడం మానలేదు. కూతుళ్ళంతా తెల్లగా బొద్దుగా ఉంటారు. ధనవంతులైన ఉద్యోగస్థులు వచ్చి పెళ్లి చేసుకుంటారని అనుకుంది. అది తారుమారయింది. పెద్ద కూతురు రేవతి పెళ్లి చేయడానికే పెద్ద అవస్థ అయింది. అప్పు చేసి మొక్కు తీర్చినట్టు పెళ్లి చేసారు. తరువాత మొదటికే మోసం వచ్చి భర్తనే పోగొట్టుకుంది.

తన కోరికలు నేల విడిచి సాములాటివని ఎప్పుడూ గ్రహించలేదు శాంతమ్మ. తను దురదృష్టవంతురాలనీ, తనకన్నీ కష్టాలేనని, తనలాగే పిల్లలు కూడా దురదృష్టవంతులనీ అనుకుంటుంది. తామే లోకంలో దురదృష్టవంతులమనీ, తమకే అని కష్టాలూ వస్తాయనీ అనుకునేవాళ్లు ఎప్పటికీ సంతోషంగా ఉండలేరు.

తల్లీ కూతుళ్ళు మాట్లాడుకుంటూ ఉండగానే శంకరం వార్తా పత్రిక పట్టుకుని వచ్చాడు.

"ఏం? రిజల్ట్స్ వచ్చాయా?" అడిగింది భానుమతి.

"ఆ.. వచ్చాయి. నేను పాసయ్యాను."

చారుమతి ఒక్కసారి బరువు తీరినట్లు నిట్టూర్చింది. భానుమతి, శాంతమ్మ సంతోషించారు.

చారుమతి లోపలి వెళ్లి శ్రీదేవి నంబరు తెచ్చి పేపర్లో చూసింది. శ్రీదేవి కూడా పాసయింది. రెండవ పార్టు తెలుగులో క్లాసు కూడా వచ్చింది.

ఆ రోజు సాయంత్రమే రామారావుగారు వచ్చి ముందు గదిలో అద్దెకు దిగారు. ఆయన మధ్య వయస్కుడు. నలభై ఉండవచ్చును. మనిషి కొంచెం రంగు తక్కువైనా స్ఫురద్రూపి. చిన్నప్పుడు చాలా అందంగా ఉండేవాడనిపిస్తుంది. ఇప్పుడు మనిషి కొంచెం లావు. జుట్టు అక్కడక్కడ నెరుస్తూంది. ఆయనని చూడగానే అనుకుంది చారుమతి. 'చిన్నవాడు, బ్రహ్మచారి కాదు. అమ్మ కోరుకున్నట్లు పెద్దాయనే వచ్చాడు' అని.

ఆయన వచ్చి ముందు గదిలో చేరగానే, రెండు గదులకీ మధ్య ఉన్న తలుపు మూసేశారు. ఇల్లు ఇరుకై ఇబ్బంది కలిగినా, అద్దె వస్తూందన్న ఆశ అందరినీ సర్దుకోనిచ్చింది.

ఆ వారంలో పద్మ ఇంటర్మీడియట్ ఫలితాలు, మాలతి ఎస్.ఎస్.ఎస్.సి. పరీక్షా ఫలితాలు కూడా తెలిశాయి. ఇద్దరూ పాసయ్యారు. భగవతి కూడా పరీక్ష పాసయినట్టు విశాఖ నుంచి ఉత్తరం వచ్చింది. ఇంట్లో అంతా పాసవడం అంధకారంలో వెలుగురేఖలా అనిపించింది. ఇక ముందేం చెయ్యడం అన్న సమస్య తల ఎత్తింది. తొందరలోనే ఉద్యోగం వెతుక్కోడం శంకరం కర్తవ్యమని నిశ్చయమై పోయింది. పోతే, మాలతి, ఎస్.ఎస్.ఎల్.సి. మాత్రం పాసయిన వాళ్ళకి ఉద్యోగం దొరకడం కష్టమే. మాలతి టైపు నేర్చు కుంటానని, హిందీ పరీక్షలకి కడతాననీ అంది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments